క్లుప్తంగా

ఖగోళశాస్త్రంపై అవగాహన సదస్సు

నీరుకొండ(మంగళగిరి): మండలంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఔట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం ఖగోళశాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యాన పైస్పార్క్ 3.0 స్టార్స్ స్కోప్ అండ్ స్పేస్ టైమ్ పేరిట సదస్సు జరిగింది. పుణేలోని ఇంటర్ యూనివర్సిటీ అస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ శివరాజ్ కందస్వామి ఖగోళశాస్త్రంపై అవగాహన కల్పించారు. విశ్వంలోని గ్రహాలు, నక్షత్రాల ఉనికి, లక్షణాలను వివరించారు. అనంతరం భౌతిక శాస్త్ర ప్రొఫెసర్లు డాక్టర్ గంగిరెడ్డి, డాక్టర్ అస్మితాదాస్, డాక్టర్ కృష్ణప్రసాద్ మైటీలు, టెలిస్కోప్, బైనర్ స్టార్ సిస్టమ్ గురించి విద్యార్థులకు వివరించారు. డాక్టర్ ప్రణబ్ మండల్, డాక్టర్ బిస్వాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కుంచనపల్లి గీతాంజలి స్కూలు, గుంటూరు విజేత స్కూలు, నల్లపాడు కేసీ స్కూలు నుంచి 120 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఏచూరి

కాజ(మంగళగిరి): మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ సంఘటితం చేయడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని సీపీఎం నాయకులు కొనియాడారు. సోమవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతితో పాటు స్థానిక నాయకుడు అప్పికట్ల శ్రీనివాసరావు 8వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు తమ్మా ప్రసాద్ రెడ్డి, ఈమని అప్పారావు, సింహాద్రి సుమ, ఈదా ప్రతాప్‌రెడ్డి, గాదె మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

మద్యానికి బానిసైన పండ్ల వ్యాపారి

తాడేపల్లిరూరల్: పొట్టకూటి కోసం వలస వచ్చిన ఓ పండ్ల వ్యాపారి మద్యానికి బానిసై అప్పులు చేసి, వాటిని తీర్చలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై తాడేపల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళానికి చెందిన వెంకన్న (45) జీవనోపాధి కోసం విజయవాడ వచ్చి సాంబమూర్తిరోడ్‌లోని బావాజీపేట 1వ లైన్‌లో నివసిస్తున్నాడు. అతను పండ్ల వ్యాపారి. వెంకన్న మద్యానికి బానిసై అందినచోట అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి రావడంతో అప్పులు తీర్చలేక తాడేపల్లి రూరల్ కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై పోలీసుల సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత పునరుజ్జీవమే లక్ష్యం



మంగళగిరి: చేనేత పునరుజ్జీవమే చేనేత అధ్యయన యాత్ర లక్ష్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. చేనేత కార్మిక సంఘం చేపట్టిన చేనేత అధ్యయన యాత్ర సోమవారం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి చినకాకాని ఎన్‌ఆర్‌ఐ జంక్షన్‌లోని నేతన్న సర్కిల్‌లోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ మాట్లాడుతూ వైఎస్సార్ నేతన్న నేస్తంతో చేనేత పరిశ్రమను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకోగా కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తాన్ని ఇవ్వకుండా పరిశ్రమను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వెంటనే నేతన్న నేస్తాన్ని పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ యాత్రతో చేనేత కార్మికుల సమస్యలను సేకరించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నేతలు పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, బాలాజీ, బత్తూరి మోహనరావు, అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు అన్నారు. చేనేత అధ్యయన యాత్రలో భాగంగా మహాత్మాగాంధీ వీవర్స్, అంబేడ్కర్ హరిజన వీవర్స్ సొసైటీలను సోమవారం ఆయన సందర్శించారు.

మహిళలకు ఉచిత వైద్యశిబిరాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పరిధిలోని డోలాస్ నగర్, అంబేడ్కర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ మానస మంజరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు అంబేడ్కర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఈ శిబిరాన్ని ఈనెల 18వ తేదీ నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, పోషణ అభియాన్, ఈట్‌రైట్, తల్లి బిడ్డ సేవలు, వయో వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు ఉంటాయని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శం

ఘనంగా ఇంజినీర్స్ డే



ఎస్‌ఆర్‌ఎంలో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పార్థసారథి తదితరులు



పంచాయతీరాజ్ మాజీ సీఈ బ్రహ్మయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

మంగళగిరి టౌన్/మంగళగిరి: మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శమని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా పేర్కొన్నారు. మంగళగిరి నగరపరిధిలోని ఓ హోటల్‌లో సోమవారం తుళ్లూరు మంగళగిరి తాడేపల్లి లైసెన్స్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ఇంజినీర్లు నివాళులర్పించారు. కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ మానవ జీవితంలో యంత్రపరికరాల వినియోగం, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా ఎన్నో పనులను అత్యంత సులువుగా, బహుళ ప్రయోజనకరంగా చేసుకోవడానికి ఇంజినీరింగ్ అద్భుతాలే కారణమన్నారు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపై ఉందని తెలిపారు. సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే వినూతన్న ఆలోచనలు చేసే ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. డెప్యూటీ సిటీప్లానర్ అశోక్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. భారతావని గర్వించదగ్గ స్థాయిలో కృషిచేసిన విశ్వేశ్వరయ్య స్మారకంగా ఇంజినీర్స్‌డేను జరుపుకోవడం ముదావాహమన్నారు. అనంతరం పలువురు ఇంజినీర్లకు శాలువాలు కప్పి సత్కరించారు.



విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా తదితరులు

కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ప్లానింగ్ సెక్రటరీలు, ఎల్‌టీపీలు, తదితర ఇంజినీర్లు పాల్గొన్నారు.

నీరుకొండ(మంగళగిరి): విశ్వేశ్వరయ్య ఆశయాలకు ప్రాణం పోస్తూ టెక్నాలజీని అభివృద్ధి చేయడం లక్ష్యమని బెంగుళూరు సారథి జియోటెక్ అండ్ ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ ఫౌండర్ డాక్టర్ సీఆర్ పార్థసారథి తెలిపారు. నీరుకొండలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో సోమవారం ఇంజినీర్స్ డే సందర్భంగా రెండు రోజులు పాటు అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో స్కూలు ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఇంజినీరింగ్ డే వేడుకలను డాక్టర్ పార్థసారథి ప్రారంభించారు. అనంతరం ఇంజినీరింగ్ డే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్ సతీష్ కుమార్, కన్వీనర్ డాక్టర్ రమేష్ రెడ్డి, కోకన్వీనర్ డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. పంచాయతీ రాజ్ విభాగం మాజీ చీఫ్ ఇంజినీర్ గుర్రం బ్రహ్మయ్య, ప్రిన్సిపల్ కె.నాగ శ్రీనివాసరావు ప్రసంగించారు. డైరెక్టర్ వినయ్‌కుమార్, డీన్‌లు డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని 17వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. కూటమి పాలనలో కొంతమంది దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, జగనన్న ఇచ్చిన హామీలు ప్రజలకు ఏ విధంగా నెరవేర్చారనే అంశాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని గుర్తు చేశారు. అధికారంలోకి రాకముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా మాట్లాడుతున్న చంద్రబాబుపై గ్రామస్థాయి వరకు ప్రజలందరినీ చైతన్య పరచడానికి సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇష్టానుసారంగా హామీలు గుప్పించిన కూటమి నేతలు ఏడాది



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

కాలంలో వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని విమర్శించారు.

ప్రశ్నిస్తే కేసులే.. చేసింది లేదు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టడం తప్ప చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది మన ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. జగనన్నను సీఎం చేయడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, సీనియర్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, షేక్ మాబు, కొసనం శ్రీనివాసరావు, డోకిపర్తి శ్రీనివాసరావు, నవీన్, వీరరాఘవులు, ఏసుబాబు, మాతంగి బాబు, మురుగుడు సాంబయ్య, వీరాంజనేయులు, వల్లంశెట్టి విజయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో.. చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం

తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): అమరావతి పేరుతో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) పేర్కొన్నారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్మాణానికి పొలాలు ఇచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వడంతో పాటు వారికి మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పి ఇంత వరకు హామీని నెరవేర్చలేదన్నారు.

ఎమ్మెల్యేను పక్కన పెట్టారు

రాజధాని విషయంలో సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఏం చేస్తున్నారో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు తెలుసా అని సూటిగా ప్రశ్నించారు. ఆయనను ఎమ్మెల్యే అనే విషయాన్ని లెక్కలోకి తీసుకోకుండా పక్కన పెట్టిన విషయాన్ని అందరికి తెలిసిన విషయమేయనన్నారు. 1,575 ఎకరాల్లో హైకోర్టు, సచివాలయం, అధికారుల భవనాలు, ఇతర శాఖలు నిర్మిస్తామని చెప్పిన చంద్రబాబు ఎందుకు 29 వేల రైతుల నుంచి 35 వేల ఎకరాలు తీసుకున్నారో చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న వనమా బాలవజ్రబాబు

చంద్రబాబు చేతకానితనానికి పరాకాష్ట

మళ్లీ ఇప్పుడు రాజధాని నిర్మాణానికి మరో 50 వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ చేసేందుకు సిద్ధమవ్వడం చంద్రబాబునాయుడు చేతకానితనానికి పరాకాష్ట అని చెప్పారు. రాజధాని నిర్మాణ ప్రణాళికలో లోపం ఉందని వైఎస్సార్ సీపీ మొదటి నుంచి చెబుతోందన్నారు. మొన్నటి దాకా వైఎస్సార్ సీపీలో ఉండి చంద్రబాబు అది, ఇది అని మాట్లాడిన డొక్కా మాణిక్యవరప్రసాద్ ఇప్పుడు మళ్లీ టీడీపీలోకి వెళ్లి వైఎస్ జగన్‌పై, సజ్జలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని పేర్కొన్నారు. రాజధాని రైతులకు ఇస్తామన్న హామీలను నెరవేర్చకపోగా రైతుల పక్షాన పోరాడే వైఎస్సార్ సీపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు.

కేఎల్‌యూ ఆచార్యురాలికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆచార్యురాలికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందిస్తున్న వర్సిటీ వాల్యూ ఎడ్యుకేషన్ సెల్ ఆచార్యురాలు కొడుకుల శంకరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఏపీ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్, ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన గుంటూరులోని కెన్నడి నెక్స్ట్ జనరేషన్ ఇంటర్నేషనల్ స్కూల్లో పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అవార్డు గ్రహీత శంకరి మాట్లాడుతూ ఈ విజయానికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే కారణమన్నారు. వర్సిటీ వీసీ పార్థసారథివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ అభినందించారు.

పని చేసేవారికి గుర్తింపు

తాడికొండ: అంకితభావంతో పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు తప్పక వస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) అన్నారు. రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అనంతవరం గ్రామానికి చెందిన ఆరేపల్లి జోజిలు సోమవారం డైమండ్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని వజ్రబాబు వారికి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ హబీబుల్లా, మండల పార్టీ అధ్యక్షులు శివరామిరెడ్డి, వివిధ విభాగాల అధ్యక్షులు పిచ్చిరెడ్డి, సయ్యద్ సైదు, రాయప్పప్రవీణ్ రెడ్డి, హేమలతారెడ్డి, గోపీ యాదవ్, అప్పిరెడ్డి, రామమహన్‌రెడ్డి, మస్తాన్ వలి, మిల్కియా, నాగమల్లీశ్వరి, అనురాధ,



వైఎస్సార్ సీపీ తాడికొండ ఇన్‌చార్జి వజ్రబాబును సత్కరిస్తున్న దాసరి కత్తిరేణమ్మ, నాయకులు

రామారావు, తుళ్ళూరు మండల అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి బేతపూడి రాజేంద్ర, జిల్లా ప్రచార కమిటీ నాయకులు దానం వినోద్, జిల్లా కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, యువజన విభాగం అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో షాపుల నిర్మాణానికి ఎంటీఎంసీ ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కేఎల్‌యూకు వెళ్లే రహదారిలో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువ కట్టపై కార్పొరేషన్ షాపుల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. వీటిలో వ్యాపారం చేసుకునేందుకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా నిబంధనలతో కూడిన ప్రకటనను సోమవారం విడుదల చేశారు. ఒకే కుటుంబం ఒకే వ్యాపారం పేరుతో స్ట్రీట్ వెండర్లకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ షాపులు పొందేందుకు స్ట్రీట్ వెండర్స్ ఈ నెల 16 నుంచి 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ అలీమ్ బాషా కోరారు. మొత్తం 40 దుకాణాలు ఉన్నాయని వీటిలో షాపును పొందేందుకు 18 ఏళ్లు పైబడిన వారు, స్ట్రీట్ వెండర్‌గా నమోదు కాబడి ఐడీ కార్డు, స్ట్రీట్ వెండింగ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ నకలు, మూడు ఫొటోలు సమర్పించాలని సూచించారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలో ఉన్న ఓ ఎలక్ట్రికల్ షాపులో చోరీ జరిగిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం నగర పరిధిలోని బ్యాంక్ కాలనీ నివాసితుడు నన్నపునేని సురేష్ తన ఇంటి కింద ఫ్లోర్‌లో విద్య ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తున్నాడు. యథావిధిగా 13వ తేదీ రాత్రి 10 గంటలకు షాపునకు తాళాలు వేసి పైన ఉన్న తన ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయాన్నే బయటకు వచ్చి చూడగా షాపు పక్కనే ఉన్న గోడపై వైర్ కాయిల్ బండిల్ పడి ఉండటం గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులను తీసుకుని కింద షాపువద్దకు వచ్చి చూడగా గోడకు సైడ్‌గా ఉన్న డోర్ గడియ పగలకొట్టి ఉంది. దాని నుంచి లోపలకు వెళ్లి పరిశీలించగా 8 కొత్త వైరు బాక్సులు, నాలుగు వైరు లూజ్ పెట్టెలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు.

గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి

షాపులో సీసీ కెమెరాలను చూడగా 14వ తేదీ అర్ధరాత్రి సుమారు 1.50 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు డోర్ గడియ పగలకొట్టి లోపలకు వచ్చి షాపులో వున్న వైరుబాక్సులను అపహరించుకోవడం కనబడింది. అపహరణకు గురైన వైర్ బాక్సుల విలువ సుమారుగా రూ. 1.50 లక్షకు పైగా ఉంటుదని బాధితుడు పేర్కొన్నారు. దీనిపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గతంలో కూడా ఇదే తరహాలో రెండుసార్లు తమ షాపులో దొంగతనం జరిగిందని దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైనట్లు బాధితుడు పేర్కొన్నాడు.

ఆశ వర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలి

తాడేపల్లి రూరల్: వేతనాల పెంపు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల మహాసభను జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మి మాట్లాడుతూ గతంలో అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా ఆశ వర్కర్లకు గ్రాట్యూటీ, వయోపరిమితి, వివిధ రకాల సెలవులు జీవో నెం. 94 ద్వారా సాధించుకున్నామని వివరించారు. ఈనెల 12న చేబ్రోలు పీహెచ్‌సీకి సంబంధించిన ఆశ వర్కర్ ఇంటూరి సులోచన అనారోగ్యంతో మరణించారని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశ వర్కర్ సీనియర్ మండల గౌరవ అధ్యక్షులుగా వేముల దుర్గారావు, డ్రైవర్స్ కాలనీ ఆశ వర్కర్ల అధ్యక్ష, కార్యదర్శులుగా విజయలక్ష్మి, జ్యోతి, కోశాధికారి బేబి, మరో 8 మంది కమిటీగా ఏర్పడ్డారు. మండల ఆశ వర్కర్ల యూనియన్ కార్యదర్శి వేముల రేణుక, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

మంగళగిరి: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ ఆలీంబాషా ఆదేశించారు. 'వైరల్ జ్వరాల విజృంభణ' శీర్షికతో సోమవారం 'సాక్షి' ప్రచురించిన కథనంపై మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటిఎంసి) కమిషనర్ ఆలీంబాషా స్పందించారు. దోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా ప్రతి రోజూ సిల్టు తొలగిస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్‌లో ప్రజలు ఇంటి వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని ప్రజారోగ్యంపై ఎంటీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

రోడ్డు నిర్మాణ పనులు చేస్తాం

తాడేపల్లి రూరల్: రోడ్డు నిర్మాణ పనులు చేస్తామని తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీంబాషా తెలిపారు. 'డొంకరోడ్లు బురదమయం' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనానికి ఆయన పైవిధంగా ఒక ప్రకటనలో స్పందించారు. ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వెనుక కృష్ణానది ఒడ్డున ఉన్న పొలాలకు రైతులు వెళ్లాలంటే నరకంగా మారిందని 'సాక్షి'లో ప్రచురితమైనట్లు పేర్కొన్నారు. ఆ డొంకరోడ్డు అంతా మట్టిరోడ్డు కావడంతో వర్షాలు పడినప్పుడు బురద మయంగా మారి పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఆ డొంక రోడ్డును జీఎస్‌బీ రోడ్డుగా నిర్మించేందుకు 39.50 లక్షలతో అంచనాలు తయారు చేశామని పేర్కొన్నారు. సదరు అంశం ఆర్థికపరమైనది కాబట్టి నగరపాలక సంస్థ బడ్జెట్‌కు లోబడి ప్రాధాన్యతా క్రమంలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సొంత వాహనదారులూ.. దరఖాస్తు చేసుకోండి

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సొంత వాహనదారులైన ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ఆర్థిక సాయానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులకు రూ.15 వేలను ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం లభిస్తుందని, మంగళవారం నుంచి 19వ తేదీ లోపు తమ సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తవారే కాకుండా 2023–2024లో సాయం పొందిన వాహనదారులు కూడా తమ సచివాలయాల్లో వెల్ఫేర్ కార్యదర్శులను సంప్రదించి అర్హతా సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో ప్రతిభ



తాడికొండ: సాఫ్ట్ టెన్నిస్ అండర్ 14, అండర్ 17 బాలబాలికలు సెలెక్షన్లలో సత్యసాయి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.కృపాకర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాయపూడి అనీల్ తెలిపారు. వారి ఆటల్లో అత్యుత్తమ స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంపికైన చిన్నారులను సత్యసాయి పాఠశాల కరస్పాండెంట్ రాయపాటి సాయిమోహన్ సాయికృష్ణ, సీఈఓ డాక్టర్ కుర్రా అమల, ఉపాధ్యాయులు అభినందించారు.

లారీ బోల్తా

దుగ్గిరాల: మంచికలపూడి నుంచి బయలుదేరిన బూడిద లోడు లారీ బోల్తా పడింది. మంచికలపూడి ఫ్యాక్టరీ నుంచి ఈ లారీ బయలుదేరి సత్తెనపల్లి వెళ్లాల్సి ఉంది. బూడిద లోడుతో వస్తున్న లారీడ్రైవర్ సోమవారం దుగ్గిరాల సినిమా హాలు సమీపంలో బకింగ్‌హామ్ కాలువ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయాడు. రోడ్డు మార్జిన్ దిగడంతో లారీ బోల్తా పడింది. కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉంది. అయితే ఎటువంటి ప్రమాదం జరగలేదు.

రెండు గ్రామాల్లో జ్వరాల సర్వే

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో సోమవారం ఫీవర్స్ సర్వే నిర్వహించినట్లు మలేరియా హెల్త్ అసిస్టెంట్ బాబురావు తెలిపారు. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించి వారికి రక్తపూత పరీక్షలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తాడేపల్లి రూరల్: జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు తాడేపల్లి రూరల్‌లోని మెల్లంపూడిలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పోషకాహారం తీసుకుంటే కలిగే లాభాలను, ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. జోనితిన్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తదితరులు అభినందించారు.